# బల్లకట్టు పాపయ్య

ఏకువజామున తొలికోడి కూసేయాల మెట్టపల్లీ సొట్టపల్లికి మయాన పార్తుండ కిట్టకాలవ గెట్టుమీన్నుంచి ఎవురయినా నిలబడి సూత్తాయింటుంటే, మెట్టపల్లి ఏపుల్నుంచి సీకట్లో బజనపాటలు యినిపించి, యింకూసేపుటికి డొంకల్లోంచి సేతికర్ర, పాడుసుకుంటా ఓనల్లయిగ్రహం మిట్టపల్లాలు ఎక్కిదిగుతా వొచ్చొచ్చి, కిట్టకాలవ గెట్టెక్కి ఆడ గొలుసుతో కట్టేసుండ బల్లకట్టుకాడికొచ్చి నిలబట్టం తెలుసుద్దన్న మాట. ఆ యిగ్రహం బల్లకట్టు పాపయ్య.

పాపయ్య పని ఏకువజామున తొలికోడికూసే యాల్టినుంచి రేత్తిరి జనం తిరుగాట్టం మాటుమణిగేదాకా కిట్టకాలవలో బల్లకట్టునడపటం. బల్లకట్టు ఉద్దోగమయినాక పాపయ్య బల్లకట్టు పాపయ్యయినాడు. ఆ సుట్టుపక్కల వూళ్ళ జనానికి, వుత్తపాపయంటే పాపయ్య ఎవురికీ తెలవదు.

పెద్దమడిసి, నమ్మకస్తుడు, ఎవురిజోలికీ పోడు, పద్దాకా బజనపాటలు పాడుకుంటా వుంటాడని వూళ్ళో పదిమందీ అనుకుంటుంటే నెలకు ఆర్రూపాయల పావలాకాడికి బల్లకట్టు ఉద్దోగమయింది పాపయ్యకు.

పెల్లాం బూసమ్మ కట్టిచ్చిన సద్దిమూట బల్లకట్టు లోనబెట్టి సెక్కమూతేసి, కాత్తె సలిగావుంటాన దుప్పటి ఆసటే కప్పుకుని, బొడ్డోంచి పుగాకు పాయదీసి వాసన సూసుకుంటా, యిప్పట్నుంచి బల్లకట్టుకు కరుసుక్కాసోటం దేనికనుకుంటా కాలవగెట్టుమీన కూకుని సుట్టముట్టిచ్చి, జనం ఎవురన్నా వొత్తావుండారేమోనని సుట్టుపక్కల సీకట్లో సూత్తా.... ఆలోశనలోపడ్డాడు బల్లకట్టు పాపయ్య.

ఇంగా జనం ఎవురూ తిరగాట్టంలేదే? ఏంజనవెూ, ఒక్కోపాలి కోడికుయకతలికేవొచ్చి తపనబడ్తాకూకుంటారు. ఇంకోపాలి రేత్తిరి యిట్టా యింటికెల్దాని బయిలెల్లి సగంలెక్క బోయినాక ఎవరోవొకరు దారిమయాన అడ్డుబడి 'గెడ్డాంపట్టుకుంటా కాత్త కాలవ దాటేసెళ్ళు అన్నన్నా' అంటా పానందీత్తారు- ఏం మద్సులో! యియ్యాల పదవలేం రాటంలేదే? రాదారిబోటు వొచ్చేయాలయింది. యీ రాదారిబోటు దర్జా రవిలుబండికన్నా వుండదు. ఒచ్చి ఒకటేమయిన బాకావూత్తా కూకుంటారు, జనాన్ని

పోగుజెయటానికి, యీళ్ళ ఆర్భాటమే ఆని యీడ జనం యిట్టా లంకణాల బోట్లెక్కకేం? యీరోజుల్లో యాడజూసినా బస్సుబుట్టి మా జోరున లగెత్తుతుంటే, యీ రాదారిబోటో రేందంటా మద్దెనా? అయినా యిప్పటికీ కొంతమంది వుండార్లే! అలవాటుమీనో, కరుజు తక్కువనో, మరదేమన్నా బకితో, పయానం పదిరోజులపాటయినా బోటెక్కి పోతావుంటారు. బల్లకట్టంటే దానిదారే వేరు. కాలవకు అడ్డంగా బస్సేడపోద్దీ! ఒంతెన్లూ, బిర్జీలంటే యాడబడ్తే ఆడ ఎట్టుంటై! యిట్టాటి కిట్టకాలవ బల్లకట్టు లేకనేపోతే జనం అల్లాడిపోవల్సిందే ఎప్పటికయినా! అసలు పొద్దుగూకులూ యిట్ట గుక్కదిప్పుకోటానికి యీలవుద్దా బల్లకట్టు మడ్సికీ? ఓ కూరగాయల మడుసులేందీ పుగాకు, మిరబగాయ, నెయ్యి, ఎన్న, పాలు, పెరుగు, నాట్లజనం, కోతలజనం, ఆరేంది యీరేంది అన్ని యాపారాలు యీ బల్లకట్టుమీన నడవాల్చిందేగా! యియాల గొల్లజనం యింగా రాలేదేం దబ్బా? ఆళ్ళొత్తే సరి కాలకడాలు, సేతిమురుగుల్తో బల్లంట్లుమీనంతా యుద్దెం చేసిపోతారు– అదొకరకం! అనుకుంటా పుగాకు మైకంలో ఏందేందో రకరకాల ఆలోసెనలు సేసుకుంటుండ బల్లకట్టు పాపయ్యకు “ఓ ఏమియ్యోవ్!” అంటూ సెవిలో టాప్పున బాకాలూదినట్టు ఎవురో కాలవ ఆతలి గెట్టునుంచి అరిశారు.

వులిక్కిబడి, పరకాయించి సూశాడు బల్లకట్టు పాపయ్య, జనం సాగారనుకుంటా. కిట్టకాలవ ఆతలిగెట్టున ఎవురో గెడకర్రకుమల్లే వుండి యిగ్రహం తొందరమీన గాఁ వాలు కదం దొక్కుతా అరుత్తావుండాడు.

“ఓ బల్లకట్టు పాపయ్యోవ్– ఓ నిన్నేనయ్యోవ్! వుండావంటయా, ఆడా?” అనరిసింది ఆతలి గెట్టుమీద యిగ్రహం.

“ఆ ఆ, వున్నాలే–” అంటా వొళ్ళు యిరుసుకుంటా లెగిశాడు బల్లకట్టు పాపయ్య.

“వున్నావంటయ్యా? నీ యిల్లు బంగారంగాను కాత్తె దొబ్బున రానీవయ్యా బల్లకట్టునూ, పొద్దెక్కుతుండదీ,” అంది యిగ్రహం గబగబ.

“ఆహోఁ అంత తొంద్రయితే ఎట్టా? కాత్తె నిదానించవయ్యా నువు ఎవురువో గాని – యీడ బల్లకట్టు గొలుసు వూడదియ్యాలా, గెడ సేతికి తీసుకోవాలా. మరి కాత్తె నిల్దొక్కుకో” అన్నాడు బల్లకట్టు పాపయ్య, సేతులకు కాత్తె నోటి ఆవిరి పట్టా.

“అఁ, అదెంతసేపులే సార్వీసయిన మడిసికి! గెట్టిగా రెండుతోపులు తోశావంటే అయిపాయె! రానీరానీ దొబ్బున” అంది యిగ్రహం.

“మల్లీ అదేమాటా! ఎంతలెక్కనించి వొత్తుండావేం?”

“యిప్పటికి రెండు కోసులు నడిత్తినీ యింగా రెండున్నర కోసులు పైసిల్కు బోవాలాయె, రానీ, రానీ” అంది యిగ్రహం.

"నీ మడిసి దొంగల్దోల! రెండు కోసులు నడ్సినోడివి బల్లకట్టుకు రెండు నిమిసాలు ఆగలేవంటయ్యా? మందేవూరేం?"

"దనియాలపాడు, ఎవురన్నా తెల్సా ఆడా?"

"బలేవోడివి! దనియాలపాడే తెలవదంటా? ఎంకటకిట్టయ్య బాగుండాడా?"

"చరేలే ఎంకటకిట్టయ్య మా మేనమామేగా! ఆయనకేం రాయికిమల్లే వుంటే మడిసీ. నా పేరు రాంకిట్టయ్యలే!"

గెట్టుకు బల్లకట్టు సేరీసేరకతలికే రాంకిట్టయ్య దడదడమంటా ఎక్కి కడ్డీ మీన కూకుని, యిగ బల్లకట్టును పోనీమన్నాడు.

"పోనిత్తాలే, యింగా మదుసులెవురన్నా వత్తుండారేమో సూద్దాం వుండు" అన్నాడు బల్లకట్టు పాపయ్య అటిటు సూత్తా.

"సూసేదేంది! యిగచరేలే. తెల్లారిపోయేదాకా యీగెట్టుకాడే కూకోబెడ్తావెట్టా? నే నసలే సొనాదూరం పోవాలంటుంటే అటిటు దిక్కుల్జూస్తా మాటినిపిచ్చుకోడేం; ఎయ్ ఎయ్ గెడేసి తొయ్యవయ్యా దొబ్బునా నీ పాపయ్య బంగారంగానూ! పుగాక్కాడ కావాలెట్టా? యింద కాలుచ్చుకో, మదుసు లెవురన్నా వొత్తావుంటే మల్లీ తిరిగొద్దువులేగానీ నడుపు నేడుపు!" అంటా రాంకిట్టయ్య కడ్డీ పట్టుకుని సిందుల్దొక్కాడు.

"ఎవరు జూసినా యిదిగిదీ వరస! పద్దాక అటిటు బల్లకట్టు నడపటమంటే మాటలంటయ్యా? కాలవ పారుదల సూడు ఎట్ట తోస్తావుండదో? పుగాక్కాడకేం గానీ ఓ కానీ బిల్లకూడా వుంటే సూడు ఎందుకయినా పనికొచ్చుద్ది" అన్నాడు బల్లకట్టు పాపయ్య బల్లకట్టు నడుపుతా.

"సిల్లరేం వుండట్టులేదే– ఎల్లుండి మల్లీ తిరిగొత్తాగా, అప్పుడిచ్చిపోతాలే, కానీ యాడికిపోద్ది, అయితే బల్లకట్టు పాపయ్యన్నా! మనికి నెలకి జీతం ఎంతొచ్చుద్దంటా?"

"ఆc, వుంటదిలే దెగ్గిర దెగ్గిర ఆర్రూపాయల పావలా – ఏం సాలుద్ది సచ్చీ?"

"పరవాలేదే? యెప్పటికయినా డబ్బు డబ్బే! పైన ఏమాత్రం?" అన్నాడు రాంకిట్టయ్య.

"పైనేందీ?" అన్నాడు బల్లకట్టు పాపయ్య.

"ఆc, అదేలే, పైన కాత్తె కూత్తె సంపాదన వుంటది కావాల్నుగా? అటిటు వొత్తా పోయే జనం అదిదంటా ఏవన్నా యియరంటయ్యా?"

"అదిదేందీ? యిప్పుడు నీ సంగతేంది సెప్పరాదూ? ఎల్లుండి సిల్లరమార్చి తెత్తానంటుంటివి! అదిగంతే పైసంటే."

"ఆర్నీ బల్లకట్టు పాపయ్య దెబ్బతీశాడే! అయితే మాటంటే నమ్మకం లేదంటావ్?

సరే నువే సూత్తావుగా ఎల్లుండీ! అయితే నీకు పెల్లాం బిడ్డలుండారా? వుండక యాడికి పోతారనుకో! యింటికి మల్లీ ఎప్పుడుపోతా? రేత్తిరి బాగా పొద్దెక్కుద్దేం? మరి బల్లకట్టు పనంటే యిగనంతేగా! తెల్లారి సీకట్లో వొత్తా సద్దిబువ్వ తెచ్చుకుంటావుగావల్ను. మరి మద్దానం బువ్వ నీ పెల్లాం తెచ్చుద్దేం? సెప్పిన మాట యింటదా నీ పెల్లాం? యినక ఎట్టుంటదనుకో! పిల్లలెంతమంది? నీకు నలభై ఏళ్ళుంటయ్యనుకుంటా - అసలు. నలబయ్యన్నా లేంది బల్లకట్టు పనికి పనికిరారనాల్సిందే - గట్టుకు చేర్నట్టుందే? మంచోడివిలే అన్నా - ఎవురో అప్పుడే తట్టలెత్తుకొస్తుండారే కోకలెగ్గట్టి; ఆర్నీ గొల్లజనం! బల్ సందడిగుంటదిలే - ఆవులెల్లుండియిత్తాలే కానీబిల్లా - ఎల్తుండా బల్లకట్టు పాపయ్యన్నోవ్," అంటా పటపట మిరపగాయలు ఏపినట్టు మాటలు దులిపి గెట్టుమీనకి దూకి గొల్లజనాన్ని ఓ సూపు సూత్తా, అంగలేసుకుంటా గెట్టుదిగి డొంకల్లోబడి మాయమయ్యాడు రాంకిట్టయ్య.

"ఓ బల్లకట్టు పాపయ్యన్నోవ్? యిటే వుండావంటయ్యా? నీకు పున్నెం వుంటది కాత్తె ఆదరికి దొబ్బునపోనియి బాబూ, అప్పుడే తెల్లార్తుండది. నాగరత్తీ రాయే దొబ్బునా! చుబ్బక్కా, లచ్చుమ్మా రాండి రాండి - ఎంకాయి పిన్నాం ఏదీ? ఓ చీతామోవ్ లగెయ్ లగెయ్" అంటా గొల్లజనం కడాలు, గొలుసులు కొట్టుకుంటా, మట్టెలు టక్‌టక్‌మనిపిస్తా, పెరుగోసన గబ్బుమనిపిస్తుంటే, రవిలుబండి పెట్టెలకుమల్లే తోసుకుంటా వొచ్చి బల్లకట్టుమీన నుంచుండారు సోల్పున మానికా, తవ్వా, సోల, గిద్దలకిమల్లే.

'అంతా వొచ్చారా యింగా ఎవురన్నా పొదలసాటున వుండారా?" అన్నాడు బల్లకట్టు పాపయ్య గెడమీన ఓరగా ఆనుకుని సూత్తా.

"పొదలసాట్నేందయ్యోవ్? సింతసచ్చినా పులుపు సావలేదంట. యీ బల్లకట్టు పాపయ్యకు ఏళ్ళు మిగులుతుండా సెతురు తగ్గటంలేదే! నవుతావు దేనికే నాగరత్తీ? మరి సూడమ్మా యీ పాపయ్యకు తెల్లారిందప్పుడే సెతురాడనూ," అంది ఎంకాయి పిన్నాం.

"అదేంది పిన్నాం అట్టంటదేం? గెడకఱ్ఱకుమల్లే పాపయ్య అట్టుంటే ఏళ్ళు మిగల్టమేంది పాపం- యిహి హిహి-" అంది నాగరత్తి కొంగుచాట్న పకపక మంటా.

"అదేంది పిల్లోవ్ అట్టిరగబడ్తుండావు? ఆ పొళ్ళు కాత్తారాలి కాలవలో పడేను" అంది చుబ్బక్క.

"అదేంది చుబ్బమ్మోవ్ అట్టంటావ్? దాని పళ్ళుచూసే పుల్లన్న దాన్ని కట్టుకుంటే" అన్నాడు బల్లకట్టు పాపయ్య గెడేసి బల్లకట్టు నడుపుతా.

"సూడే ఎంకాయి పిన్నాం యీ పాపయ్యా? నన్నంటే అన్నావుగానీ ఇంటికాడ మా బూసమ్మొదినకాడ అనేవయ్యోవ్ బఱ్రం వొల్లంతా పిడకలు కొట్టుద్దీ" అంది నాగరత్తి.

"అయితే పద్దాకా ఈ వుత్తకబుర్లేనా లేకబోతే యియ్యాలన్నా కాత్తె పెరుగు సద్దిబువ్వలోకి పోత్తారా?" అన్నాడు బల్లకట్టు పాపయ్య.

"కాత్తె పొయిరాదంటే నాగరత్తీ!" అంది లచ్చుమ్మ.

"ఆఁ, నువు పొయరాదూ సాటుగా మూలకూకుండావుగానీ? యియ్యాలసలే నా పెరుగు తగ్గింది ఏం మాటొచ్చుద్దో. పిన్నాంకాడ ఏమన్నా దొరుకుద్దేమో" అంది నాగరత్తి.

"చరే నా సంగతి పాపయ్యన్నకే తెల్చు" అంది ఎంకాయిపిన్నాం.

"పులుపు సిచ్చుగుండది మరీ యియాల నా పెరుగు! మరీ ఇదెట్టపోయనమ్మా– కాదంటే చుబ్బక్కా!" అంది సీతాం.

"ఇదిగో మద్దె మీరెందుగ్గాని కొట్టుకోటం గెట్టొచ్చింది దిగండి దిగండి; మీ సంగతి యియాల నాకేమన్నా కొత్తెట్టా. రత్తమ్మ వొత్తావుంటే మిమ్మల్ని అడక్కనేపోదును. పోనీగానీ ఎవురో ఒకరు రేపన్నా కాత్తె పోసిపోండి" అన్నాడు బల్లకట్టు పాపయ్య.

"ఓ, రేపు తప్పకుండా నలుగురం నాలుగింతలు పోసీపోతే సరిగా– దిగరేమే యింకా కూకుండారూ! రాండి రాండి పొద్దెక్కింది–" అంటా తోసుకుంటా గెట్టుదిగి ఎల్లిపోయారు గొల్లజనం.

అటిటు సూసి దగ్గిర్లో జనం ఎవురూ లేకబొయ్యేతలికి యాప్పుల్ల ఇరుసుకుని నోట్లోబెట్టుకుని, గెట్టుమీన కూకుండాడు బల్లకట్టు పాపయ్య.

సంకురేతిరి దగ్గరకొస్తుండది, యిగ కోతలజనం సాగుతారనుకుండాడు పాపయ్య. యాడ జూసినా వొడ్డగింజ అగుపిస్తావుంటది. దొబ్బున కోతలొస్తే బాగుండుననుకున్నాడు పాపయ్య. అయినా ఈ కూలిజనానికి తగువాడుకోడంతోనే సరిపోద్దిగాని పక్కవోడిమాట యినిపిచ్చుకొనే యినిపిచ్చుకోరు. అదేమంటే ఆసాములు కూలిగింజలు సరిగా కొలవటంలేదంటారు. ఎంతసెడ్డా ఆళ్లూ కూలిజనమేగా మరి? మిరబగాయ ధర పెరిగిందంట. పద్దాకా బల్లకట్టు తొందరేగాని ఏమన్నా యీయకుంటే రేపురేపంటాడే ఎప్పుడు సూసినా ఈ రంగయ్య. ఆరోరికి తోస్తే ఏమన్నా యిచ్చిపోతుండాల్చిందేగాని గెట్టిగా ఎవర్ని మటుకేం నిలదీస్తాం, తప్పుగాదూ? బల్లకట్టు ఎక్కనియ్యకుంటానికి నాయబ్బసొమ్మేట్టా బల్లకట్టూ? యింటో సూడబోతే యీ బూసమ్మ నే నేమో మూటలు కట్టుకు రాటం లేదనుకుంటది. యిక్కడి యవారం నీకు తెలవదులే అంటే నీకు నోట్లో నాలికలేదంటది. ఇంటో వుండే ఆడగూతురు గనక అదామాటన్నది. "యీ భాగ్యానికి చీకట్లో సనంగా లెగిసెల్లి వూరు నిదరబోయినాక తిరిగిరావాలా?" అంటది. చీకట్లో లెగిసొస్తుంటే పంచిపట్టుకు గుంజుద్ది. తెల్లారినాక పోవచ్చులే అంటా. పద్దాకా మంచంలో ఫడుకుంటానికి ఎనక తింటానికేవన్నా వుంటే గదా? ఏందో, దాని

రంది దాన్దేగాని ఇవకాడ యవారం కాత్తెన్నా తెల్చుకోనక్కర్లా! చుబ్బయన్నా అగుపియటం లేదే. కాత్తె అప్పేదన్నా యిత్తాడేమో అనుకుంటే? ఆవజాన ఎటెటుగానో ఆలోసెనెల్లో బడిపోతుండాడు బల్లకట్టు పాపయ్య.

"ఓ బల్లకట్టు పాపయ్యన్నోవ్, రావయ్యా, రావయ్యా ఆతలేపుకెల్లి అటనే కూకుండావూ!" అంటా అరుస్తా ఆతలేపు జనం గట్టెక్కటం సూసేతలికి వులిక్కిపడి లెగిసి గెడతీసుకున్నాడు బల్లకట్టు పాపయ్య.

"మీ అమ్మ రాలేదేరా కొండయ్యా! అంతలావుపనేం జేత్తుండ దబ్బా ఇంటికాడా?" అన్నాడు బల్లకట్టు పాపయ్య, కొడుకు కొండాయి మజ్జానం బువ్వ దెచ్చి ఏపసెట్టుకింద పెట్టేతలికి.

"బట్టలు గుంజుకోవాలంట" అన్నాడు కొండాయి.

"బట్టలు ఇప్పుడే గుంజుకోవాలెట్టా! నువు బువ్వతిన్నావంట్రా" అన్నాడు పాపయ్య బువ్వకాడ కూకుంటా.

"తిన్నానయ్యా, అదేమో నేను బెచ్చాలాడుకుంటుంటే వొచ్చి బువతీసికెల్లమని అమ్మ కొట్టిందే."

"అయితే ఎప్పుడూ బెచ్చాలేనంట్రా నువాడేది?"

"బిల్లంగోడు కర్ర సుబ్బాయి తీసికెల్లాడు".

"చీ యదవా ఎప్పుడూ ఆటలేనంటుంటే!"

"నిన్నా, యియ్యాలేనయ్యా నే ఆడ్తుండదీ! అయ్యోవ్ బల్లోకి పంపిత్తానంటివే?"

"ఎళ్దువులే. బడియాడికిపోద్ది? యిదిగో యీపాలి గెట్టిగా పంతుల్తో సెప్పి బళ్ళో సేరిపిత్తే సరిగా! మరి ఎప్పుడు సెప్పినా పైనొచ్చే మంచిరోజున సేరిపిత్తా నంటాడేగాని మరామంచిరోజు ఎప్పుడొచ్చుద్దో యిన్నాలకీ తేలకబోయె! సివరికి సేతిలో యావన్నా పెట్టమంటాడో ఏందో మరి? యిదిగో యీపాలి అదేదో గెట్టిగా నిలేసి తేల్చుకుంటాగా. ఒరే కొండాయ్!".

"ఏందయ్యా!"

"అయితే మీ అమ్మ యింటికాడ ఏంజేసుద్దంటా?"

"బట్టలు గుంజుకోవాలంట"

"ఇప్పుడే బట్టలు గుంజాలెట్టా? బువదీసుకుని కూసేపు యిటొచ్చిపోతే కాళ్ళేం అరిగిపోతాయ్యా? ఒరె కొండాయ్!"

"ఏందయ్యా?"

"రేపు మజ్జానం మీ అమ్మనే బువపట్టుకు రామను."

"రేతిరి అమ్మతో నువే సెప్పరాదంటయ్యా?"

"పరవాలేదులే సెప్పమంటూంటే?"

"నాకేం, అయ్య సెప్పమన్నాడని సెబుతా."

"చా ఎదవా పొళ్ళురాల్తయి సెప్పావంటే తెల్చిందా? ఎవురో వొచ్చి అప్పుడే బల్లగట్టుమీద కూకుండారే! కాత్తె వుండవయ్యా బువదింటుండానూ" అంటా బువ తీసుకురావటానికి బూసమ్మ పాలుమాల్తుండదని చిరాకుబడ్తా బువకాణ్ణుంచి లెగిశాడు పాపయ్య.

* * *

ఓరోజు బాగా రేత్తిరయినాక బల్లకట్టు పాపయ్య యింటికెల్దామని గెట్టుదిగే సమయానికి అవతలి గెట్టునుంచి పొరుగూరు ఎల్లివస్తావుండ సుబ్బయ్య గొంతు యినిపించింది.

"రా, రా, సుబ్బయన్నా - యింగా నయం యిప్పుడే బల్లకట్టేసి గెట్టు దిగబోతుండా - ఎన్నాలయిందీ సూసీ! ఏవూరెల్లావూ ఏందికతా రా, రా-"

సుబ్బయ్యను యివతలి గట్టుకు సేర్చి మల్లీ బల్లకట్టు గొలుసు బిగిచ్చాడు పాపయ్య.

"కూసేపు కూకునెల్దాం కూసో పాపయ్యా. అబ్బ నడిసి నడిసి సివరికి మనూరి సాయల కొచ్చేతలకి పోయిన పానం మల్లీ తిరిగొచ్చిందంటే నమ్ము! కాళ్లు గుంజుతుండై. కూసేపు కూకుని పోదాంలే వుందూ- ఆఁ తంగిరాల్లో బాకీవుంటే పోయినాలే - కూకో, కూకో నీ పెళ్ళాంతో నేను సెబుతాలే" అన్నాడు సుబ్బయ్య గట్టుమీన సాగిలపడ్తా.

"ఆఁ, అదినకే గుబులు మడిసి" అన్నాడు పాపయ్య పొద్దు సానా పోయిందనుకుంటా.

"కాదుమరీ! ఎంతసెడ్డా పెల్లామాయె. యిదిగో మనగాడి లంకపుగాకుండది ఓ పాయసుట్టిసూడు - కూకో - నాకాడ సెకుముకి వుండదిలే."

సుబ్బయ్య, బల్లకట్టు పాపయ్యలు సుట్టలు ముట్టిచ్చి కూకుండారు, సీకట్లో కోటప్ప కొండమీద శికరాలకిమల్లే.

ఆవజాన కూకుని సుబ్బయ్య బల్లకట్టు పాపయ్యలు ఏమ్మాట్టాడకుండా సుబ్బయ్య పాపయ్యతో సెప్పిన అస్సల్సంగతిది:

"పుగాకు అమ్మకం బెట్టిన మన రత్తయ్యను ఎరుగుదువుగా?" అన్నాడు సుబ్బయ్య.

"అదేంది సుబ్బయ్యన్నా, రత్తయ్యనే ఎరగనంటా?" అన్నాడు పాపయ్య.

"నీకు ఎందుకు తెలవదుగానీ, అయితే ఈ సంగతి యిన్నావా?" అన్నాడు సుబ్బయ్య.

"అదేందో నాకేం తెలుసుద్ది సెప్పందీ?" అన్నాడు పాపయ్య.

"రత్తయ్య పెల్లాం కాంతమ్మ ఆ పొరిగింటి ఈరబెమ్మం పిలుస్తే దేశాంతరాలెల్లిందంట!" అన్నాడు సుబ్బయ్య.

"చా!" అంటా నోరు దెరిశాడు బల్లకట్టు పాపయ్య.

"ఆ ఏంది! రెండు మూడు దినాలు కప్పెట్టారు. చివరికి గబ్బులెగిసింది" అన్నాడు సుబ్బయ్య సుట్టపొగ పంటి సందుల్నించి వొదుల్తా.

"అదేంది – కాంతమ్మ–" అంటున్నాడు పాపయ్య యింకా తెప్పరిల్లక.

"మంచిదేమరి! ఏమయినా యివన్నీ మనమాటల్తో కట్టుబడుండే యవారాలు కాదు సూడూ! ఈ రత్తయ్యేమో నాలుగు డబ్బులు సంపాయించుకొద్దామని రెండు మూడు దినాలపాటు పొరుగూరు ఎల్తావుంటాడూ. మరి యీ మద్దెన ఈరబెమ్మం ఏం పసరుపూశాడో ఏమో – కాంతమ్మ కాస్తా మాయమయింది!" అన్నాడు సుబ్బయ్య.

"అంతా మాయగావుంది!" అన్నాడు పాపయ్య

"ఇదిగో మన్లోమాట – మనూరి రంగయ్యకు నువేమన్నా బాకీ పడ్డావంటయ్యా పాపయ్యా?" అనడిగాడు సుబ్బయ్య.

"ఆఁ వుంటే రూపాయో, రెండో వుంటదిలే" అన్నాడు పాపయ్య.

"అబ్బే ఏంలేదుగానీ వాడి గుణం మనూళ్ళో అందరికీ తెల్సిందే గదా? ఆఁ నువు యింటోలేనప్పుడు ఎల్లి నీపెల్లాం బూసమ్మను ఏదించుకుతింటాడంట. ఆడ్డి ఆడకి పారెయరాదూ పీడా వొదుల్తుందీ – మాట్టాడుకుంటా ఎల్దాం లెగు పొద్దుపోతుందదీ" అంటా పంచ దులుపుకుంటా లెగిశాడు సుబ్బయ్య.

"ఓ బల్లకట్టు పాపయ్యన్నోవ్? బాబ్బాబు కాత్తె బల్లకట్టు యివకడికి రానియి నాయనా సానా పొద్దు పొయ్యొచ్చాముూ" అనరిశారు ఎవరో ఆతలి గట్టునుంచి.

* * *

ఆ రేత్తిరీ, మరసనాడు ఏకువజామున బల్లకట్టు పాపయ్య బజనపాటలు ఎవురికీ యిన్రాలా.

మజ్జానం బువదెచ్చిన కొండాయికి బల్లకట్టు వొప్పజెప్పి, మెట్టపల్లికి గబగబ ఎల్లి, తనింటోనించి రంగయ్య సుట్ట ముట్టించుకుపోతుంటం సూసిన బల్లకట్టు పాపయ్య ఎల్లి పెళ్ళాం బూసమ్మ వొళ్ళు పచ్చడిజేసి బల్లకట్టుకాడికొచ్చి యిగ ఆడనే గెడకర్ర తీసుకు కూకుండాడు.

ఆ నిశిరేత్తిరి కిట్టకాలవ గెట్టుకాడికొచ్చి, పాపయ్య కెదురుగ్గా నిలబడ్డది పెల్లాం బూసమ్మ కొడుకు కొండాయితో.

"ఇంటికి ఎల్దాం రా" అంది బూసమ్మ ఏడుస్తా.

"దెగ్గిరకొచ్చావంటే సంపుతా - ఎల్లు" అన్నాడు పాపయ్య.

"సంపు. సంపి యీ కిట్టకాలవలో పారెయ్యి నన్ను. నే నేపాపం ఎరగను, నీ కేందో గుబులు తిరిగింది" అంది బూసమ్మ.

"ఎవురికి తిరిగిందో యియాల తేలుత్తా" అన్నాడు పాపయ్య.

"నువు ఏందేల్చినాసరే నేను యీడే పానం వొదుల్తా" అంది బూసమ్మ.

ఆవజాన ఏంజరిగినా జరగనీ - రేత్తిరి మూడు గంటలయాలకు బల్లకట్టు పాపయ్యను ఎంటబెట్టుకుని కొండాయితో యింటికి సేరింది బూసమ్మ.

అప్పట్నుంచి కొన్నేళ్ళు అయ్యా, అమ్మకు బెడుస్తారావటం కొండయ్య సూస్తావొచ్చాడు.

"ఒరే కొండయ్యా!" అని ఓనాడు కొడుకును పిలిశాడు మంచంలో కూకుండ బల్లకట్టు పాపయ్య.

"ఏందయ్యా?" అన్నాడు కొండయ్య.

"రేపట్నుంచి యిగమీదట బల్లకట్టుపని నువు సూసుకో. నాపని అయిపోతుండది" అన్నాడు బల్లకట్టు పాపయ్య.

"నాపెల్లాం బల్లకట్టు పని వొద్దంటున్నది" అని సెప్పాడు కొండయ్య.

మరుసనాడు కోడితోపాటు లెగిసి, పెల్లాం కట్టబెట్టిన సద్దిమూట తీసుకుని కఱ్ఱపొడుసుకుంటా భజనపాటలు పాడుకుంటా ఎప్పటికిమల్లే కిట్టకాలవ బల్లకట్టు ఏపుగా ఎల్లాడు బల్లకట్టు పాపయ్య.

**మా.** గోఖలేగారి బహుళ ప్రజాదరణ పొందిన కథ "బల్లకట్టు పాపయ్య"ను దూరదర్శన్ వారు 30 ని॥ల నిడివి చిత్రంగా ప్రసారం చేశారు. పాపయ్య పాత్రను ప్రముఖ చలనచిత్ర నటుడు రాళ్లపల్లిగారు పోషించారు. అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయం, ప్రాచ్యభాషల విభాగం వారు డిగ్రీ స్థాయి (దూరవిద్య) లోను, డా॥బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారు డిగ్రీ స్థాయిలోను "బల్లకట్టు పాపయ్య" కథను ప్రత్యేక తెలుగు పాఠ్యాంశంగా చేర్చారు.